క్లుప్తంగా

పందులను తరలించకపోతే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పందులను దూరంగా తరలించాలని, లేకపోతే చర్యలు తప్పవని పందుల పెంపకందారులను కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయంలో పందుల పెంపకందారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో పందులు స్వైర్వవిహారం చేస్తున్నాయన్నారు. కళాశాలలు, పాఠశాలల్లోకి వెళ్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారన్నారు. వర్షాకాలంలో పందుల కారణంగా పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. రెండు వారాల్లోగా పందులను నగర పంచాయతీకి దూరంగా జనసంచారంలేని ప్రదేశాలను తరలించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లా నూతన కలెక్టర్ ఆనంద్‌ను బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

వీధి కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, ఎంహెచ్ఓ వెంకటరమణ ఆదేశాల మేరకు పశువైద్యాధికారి మదన్‌మోహన్ పర్యవేక్షణలో నగరంలోని అన్ని డివిజన్లలో వీధి కుక్కలకు శుక్రవారం రెండో విడత యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేశారు. వీధి కుక్కల నియంత్రణకు నిరంతరం వాటికి సంతానోత్పత్తి కలుగకుండా శస్త్రచికిత్సల ప్రక్రియను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల ప్రజలు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేస్తే నియంత్రణచర్యలు తీసుకుంటామని సూచించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మత్తు పదార్థాలతో జీవితాలు నాశమవుతాయని, వాటికి యువత దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని కేఏసీ కళాశాలలో 'డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం.. యువత బంగారు భవితకు బాటలు వేద్దాం' అనే అంశంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల తలెత్తే దుష్పరిణామాలు, అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ప్రముఖ న్యాయవాది సుబ్బమ్మ, రామచంద్రారెడ్డి వైద్యశాల వైద్యులు దత్తాత్రేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష, అధ్యక్షుడు నరేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, నగర ఐద్వా కార్యదర్శి పద్మ, కేఏసీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

నెల్లూరు (టౌన్): నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ కోరారు. నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 16 ఉన్నత, 10 ప్రాథమికోన్నత, 40 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఆయా పాఠశాలల పరిధిలో దాదాపు 170 మంది ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పాఠశాలలు ప్రారంభించి నెలరోజులు కావస్తున్నందున త్వరగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. జీఓ 117ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నగరాధ్యక్షుడు నారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సుమన్, నాయకులు వెంకటసుబ్బయ్య, వెంకటరత్నం, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నూతన కలెక్టర్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏ ఆనంద్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం మంత్రి నారాయణను చింతారెడ్డిపాళెంలోని నివాసంలో కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనంను కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌తో మంత్రులు పలు విషయాలపై చర్చించారు. జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు.

భక్తజన తీరం



తీర్థవాదికి తరలివచ్చిన భక్తులు

విడవలూరు మండలం రామతీర్థంలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తీర్థవాది (సముద్ర స్నానం)కు శుక్రవారం భక్తజనం పోటెత్తారు. రాముడు నడియాడిన తీరంగా ప్రసిద్ధి చెందిన రామతీర్థం తీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయనే నమ్మకంతో భక్తులు భారీగా తరలివచ్చారు. అమావాస్య కావడంతో సముద్రంలో అలల తాకిడి ఎక్కువగా ఉంది. అయినప్పటికీ లెక్కచేయకుండా భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. సైకత శివలింగాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని నందీశ్వరుడు, రామలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సంప్రదాయంగా కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరుని ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకెళ్లి వసంతోత్సవం, తీర్థవాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తంబి సిద్ధయ్య జ్ఞాపకార్థంగా ఆయన భార్య సుబ్బమ్మ వ్యవహరించారు. కాగా తీర్థవాది సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీరంలో పోలీసులు, మెరైన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

–విడవలూరు



సైకత శివలింగం వద్ద పూజలు చేస్తున్న భక్తురాలు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సర్వశిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు చిక్కీలు అందకపోవడంపై ఆరా తీశారు. చిక్కీలను ఇంకా సరఫరా చేయలేదని భోజన ఏజన్సీ నిర్వాహకులు వెల్లడించారు. ఏపీసీ వెంట హెచ్ఎం సునంద తదితరులు ఉన్నారు.



భోజనాన్ని రుచి చూస్తున్న ఏపీసీ ఉషారాణి

బడిఈడు పిల్లందరూ బడిలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ–2 సునీల్‌కుమార్ తెలిపారు. నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని, చిన్నారులను బడిలో చేర్పించి చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇందుకూరుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిలహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు

పొదలకూరు: ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని తాటిపర్తి పశువైద్యశాలలో శనివారం కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేయనున్నట్లు పశు వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ బీ సుజాత శుక్రవారం తెలిపారు. బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, జువాలజీ), బీఏ (హిస్టరీ) గ్రూపుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99596 70694 నంబర్ లేదా కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

లక్ష్య సాధన దిశగా చదువులు సాగాలి

• సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం: లక్ష్య సాధన దిశగా విద్యార్థుల చదువులు సాగాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత, గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులకు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, టీడీపీ , బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

పొదలకూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యాకానుక కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీని సందర్శించి వసతులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రామారావు, ఏపీసీ ఉషారాణి, ఎంపీడీఓ మహ్మద్‌రఫి, ఎంఈఓ శోభనాద్రి, హెచ్‌ఎంలు సునంద, సనత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.




పొదలకూరులో విద్యార్థినికి విద్యాకానుక కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మహిళలకు రక్షణగా నిలవాలి

• ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

నెల్లూరు(వేదాయపాళెం): పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా, వారికి సురక్షితమైన వాతావరణం కల్పించే దిశగా మహిళా శిశు సంరక్షణ అధికారులు కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ సూచించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ మహిళల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దర్గామిట్టలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి మహిళా అధికారులు హాజరయ్యారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మాట్లాడుతూ మహిళల సంరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఓఎస్‌హెచ్ యాక్ట్–2013పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో పది మంది మహిళలు పనిచేసే చోట ముగ్గురితో ఇంటర్నల్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అందులో ఒకరు ఎన్‌జీవో సంస్థ నుంచి ఉండాలన్నారు. మహిళలపై వేధింపులు జరిగినట్లుగా కమిటీ సిఫార్సు చేస్తే 509 సెక్షన్ కింద సమస్యలను మూడు నెలల్లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కమిటీ వద్ద న్యాయం జరగకపోతే జిల్లా స్థాయిలోని లోకల్ కంప్లైంట్ కమిటీ(ఎల్‌సీసీ)కి ఫిర్యాదు చేసుకుని న్యాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



తల్లులకు అవగాహన కల్పిస్తున్న రమణమ్మ

మనుబోలు: డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ సూచించారు. మనుబోలులోని కోదండరామపురం అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలకు డయేరియాపై వైద్యాఆరోగ్య సిబ్బందితో కలిసి ఆమె అవగాహన కల్పించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించడం ద్వారా డయేరియాను అరికట్టవచ్చని తెలిపారు. పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వేడిగా ఉన్న ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరమ్మ, అంగన్‌వాడీలు మస్తానమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన 1098 సేవలు, బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తొలుత వసతి గృహంలోని వసతులు, భోజనం ఏర్పాట్లను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ కస్తూరి, తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెక్లెస్ రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దుతాం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని స్వర్ణాల చెరువు, ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. స్వర్ణాల చెరువు, నెక్లెస్‌రోడ్డును అధికారులతో కలిసి మంత్రి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, పక్కనే ఎంతో పవిత్రమైన నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని తమ హయాంలో రూ.24 కోట్లతో అభివృద్ధి చేశామని, ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. డీకేడబ్ల్యూ కళాశాల వెనుక వాటర్ స్పోర్ట్స్ పెట్టేందుకు ఎకరా స్థలం తీసుకోవడం జరిగిందన్నారు. 2014లో ప్రారంభించిన పనులను త్వరలోనే పూర్తిచేస్తామని, ఇందుకు సంబంధించి ప్రణాళికలను వెంటనే తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, తదితరులు ఉన్నారు.



ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి నారాయణ

30 మంది యువత రక్తదానం

నెల్లూరు సిటీ: పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని నోవా బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నువ్వూరు అశోక్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 30 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజ్ మాట్లాడుతూ నిరుపేదలకు ఆపన్నహస్తం అందించేందుకు తమ సేవా సొసైటీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా సొసైటీ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతకు ఆదర్శంగా నిలిచేందుకు నువ్వూరు అశోక్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సమాజ సేవలో యువత పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. నోవా బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి మోపూరు రిషిత, మునివెంకటసూర్య, సభ్యులు యశు, రాజా, సాయితేజ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువత

గిరిజన చిన్నారుల భవితకు బాట

• డ్రాపౌట్స్‌పై రామన్నపాళెం పాఠశాల హెచ్ఎం ప్రత్యేక దృష్టి
• ప్రతిరోజూ ఇంటింటి సందర్శన
• గిరిజన పిల్లలను బడిలో చేర్పించడంలో సఫలీకృతం
• ఫలితంగా గణనీయంగా పెరిగిన విద్యార్థులు



గిరిజన చిన్నారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న హెచ్ఎం గౌస్‌బాషా

కొడవలూరు: ఆ పాఠశాలలో విద్యార్థులు ఆశాజనకంగా లేరని ప్రధానోపాధ్యాయుడు భావించారు. గిరిజన పిల్లలు డ్రాపౌట్స్‌గా మారడం వల్లే విద్యార్థుల సంఖ్య పడిపోయిందని గుర్తించారు. గిరిజన చిన్నారులను బడిబాట పట్టించి వారి భవితకు బాటలు వేయాలని సంకల్పించారు. డ్రాపౌట్స్ పిల్లలను గుర్తించి ఉపాధ్యాయుల సాయంతో ప్రతిరోజూ వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సత్ఫలితాలు సాధించారు. విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచగలిగారు రామన్నపాళెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్కే గౌస్‌బాషా. మండలంలోని రామన్నపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు ఉండగా, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే పాఠశాలలో పిల్లల సంఖ్య మాత్రం నిరాశాజనకంగా ఉండేది. పట్టుమని 40 మంది పిల్లలు కూడా ఉండేవారు కాదు. దీనికి తోడు డ్రాపౌట్స్ సంఖ్య పెరగడం సర్వసాధారణమైంది. ఇదే పరిస్థితి కొనసాగితే పాఠశాల మనుగడే ప్రశ్నార్థకమని భావించిన హెచ్ఎం డ్రాపౌట్స్‌పై ఆరా తీశారు. పాఠశాలకు వస్తున్న గిరిజన చిన్నారులు అనేక మంది డ్రాపౌట్స్ అయ్యారని తెలుసుకున్నారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా పిల్లలను బడి బాట పట్టించవచ్చని భావించారు. ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడిని సాయంగా తీసుకుని డ్రాపౌట్స్ పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడడం ఆరంభించారు. పిల్లలు పనులకు వెళ్లడం ద్వారా వారి భవిష్యత్తు అంధకారమవుతుందని, చదువుతో వారి ఉజ్వల భవితకు ఎలా బంగారు బాటలు వేయవచ్చో వివరించడంతో పాటు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను తెలియజేసి బడి బాట పట్టించారు. తిరిగి బడి బాట పట్టిన పిల్లలపై చదువు ఒత్తిడి ఉంటే మళ్లీ డ్రాపౌట్స్‌గా మారే ప్రమాదం ఉందని, వారికి పాఠశాలలో ఉన్న టీవీలో వివిధ రకాల నీతి కథలు, పాఠ్యాంశాలను చూపుతూ రోజూ బడికి వచ్చేలా కృషి చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నుంచి ఇదే పనిగా పెట్టుకున్న హెచ్ఎం కృషి ఫలితంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 62 కు చేరింది. హెచ్ఎం కృషిని గుర్తించిన గ్రామస్తులు, అధికారులు సైతం అభినందిస్తున్నారు.

ఉపాధ్యాయుల సహకారంతో

డ్రాపౌట్స్‌ను పాఠశాలలో చేర్పించడంలో సహఉపాధ్యాయులైన ఎస్కే ఫిరోజ్, ఎన్ శ్రీలక్ష్మి, పీ కిరణ్మయి ఎంతో సహకారం అందించారు. వారి సహకారం తోడవడంతో డ్రాపౌట్స్‌ను మళ్లీ బడి బాట పట్టించడంలో సఫలీకృతులం కాగలిగాం. ఇంకా కూడా డ్రాపౌట్స్ ఉన్నట్లు సమాచారం ఉంది. వారిని కూడా పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తాం.

–ఎస్కే గౌస్‌బాషా, హెచ్ఎం, రామన్నపాళెం ప్రాథమికోన్నత పాఠశాల

హెచ్ఎం కృషి అభినందనీయం



డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించడంలో రామన్నపాళెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ఎస్కే గౌస్‌బాషా కృషి అభినందనీయం. ప్రతిరోజూ కొంత సమయం అందుకు వెచ్చించి సహఉపాధ్యాయులను సాయంతో డ్రాపౌట్స్ పిల్లలను బడిలో చేర్పిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలో పిల్లల సంఖ్యను గణనీయంగా పెంచారు.

– జీ వసంతకుమారి, ఎంఈఓ, కొడవలూరు